మరో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

నల్గొండ, బతుకమ్మ :నల్గొండలో మరో ఆర్టీసీ కార్మికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. స్థానిక బస్ డిపో ఎదుట ఆర్టీసీ డ్రైవర్ వెంకన్న పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. ఈ ఘటనను గమనించిన తోటి కార్మికులు వెంటనే అప్రమత్తమై వెంకన్నను అడ్డుకున్నారు. అనంతరం ఆయనను సురక్షిత ప్రాంతానికి తరలించారు.

మే 1 నుంచి బదిలీల ప్రక్రియ

ఆర్థిక శాఖ ఉత్తర్వుల జారీ



DIRECTORATE OF TREASURIES AND ACCOUNTS
TELANGANA, HYDERABAD

హైదరాబాద్, బతుకమ్మ : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై నిషేదం ఎత్తివేసిన విషయం తెల్సిందే. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ జీవో ఎం.ఎస్.నం బర్.38 ఈ నెల 21న విడుదల చేసింది. అందుకు సంబంధించి బదిలీలు, పోస్టింగ్ ల కోసం గురువారం రాష్ట్ర ఆర్థిక శాఖ షెడ్యూల్ ను విడుదల చేసింది. మే 1న ప్రారంభించి చివర వరకు ఈ ప్రక్రియను ముగించాలని స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. మే 1 నుంచి 7 వరకు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీల వివరాలను ఖచ్చితంగా బదిలీ అయ్యే ఉద్యోగుల జాబితాను ఆయా కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. ఈ నెల 8 నుంచి 15 వరకు బదిలీ కొరకు ఉద్యోగుల నుంచి అప్లన్లు స్వీకరిస్తారు. మే 16 నుంచి 24 వరకు ప్రభుత్వ ఉద్యోగులు బదిలీ కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. మే 25 నుంచి 31 వరకు గరిష్టంగా మూడు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి నాలుగో సంవత్సరంలో పని చేస్తున్న వారికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తారు. బదిలీ ఉత్తర్వులు వెలువడిన తర్వాత మూడు రోజుల్లోనే రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. అందుకు సంబంధించి ఆర్థిక శాఖ ఉత్తర్వులను జారీ చేస్తూ ఆర్థిక శాఖ డైరెక్టర్ పార్వతిదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు బదిలీ కాకుండా ఉండేందుకు గాను మూడేళ్ళలోపే పదవీ విరమణ చేయాల్సిన వారికి వివిధ అనారోగ్య వైద్య సేవలు పొందుతున్న వారికి మానసిక వికలాంగులు, పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు, భార్యభర్తల కేటగిరిలో 60 శాతం కంటే మించి అంగవైకల్యం ఉన్న వారికి మినహాయింపు కల్పించారు. దాదాపు 8 సంవత్సరాల తర్వాత జరుగుతున్న ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో చాలామట్టుకు శాఖల్లో 40 శాతానికి మించి ఉద్యోగులు బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటి వరకు చాలా మంది పైరవీలతో డిప్యూటేషన్లలో ఉన్న వారు సర్వీసును క్రమబద్ధీకరించుకునేందుకు పైరవీలు చేసే అవకాశం లేకపోలేదు. ఈ మేరకు ప్రభుత్వ పెద్దలతో, ఉద్యోగ సంఘాల లీడర్లతో ఇది వరకే టచ్ లోకి వెళ్లినట్లు సమాచారం.

వేల్పూర్ సాయిబాబాకు వెండి కిరీట బహుకరణ

వేల్పూర్, బతుకమ్మ :వేల్పూర్ సాయిబాబా విగ్రహానికి కు బడా భీమ్ గల్ కు చెందిన దాతలు కొత్త నిర్మల,శంకర్ దంపతులు వెండి కిరిటాన్ని గురువారం బహుకరించారు. వారి మొక్కులో భాగంగా ఒక లక్ష ముప్పై వేల విలువగల నూతన వెండి కిరీటాన్ని చేయించిన దాత దంపతులు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ అర్చకుడు అనురాగ్ పాండే సమక్షంలో బహుకరించారు. అనంతరం కొత్త నిర్మల శంకర్ దంపతులు శ్రీ సత్యనారాయణ వ్రతాన్ని చేసి మొక్కు చెల్లించుకుని అన్నదానం చేశారు. పడిగెలకు చెందిన ఆర్మూర్ గంగారాం కుటుంబ సభ్యులు సైతం అన్నదాతలుగా నిలిచారు. అన్న పూజా, గోపూజను శాస్త్రబద్ధంగా నిర్వహించారు . తదనంతరం ధ్యాన మందిరంలో భజనలు చేశారు. సుమంగళి మహిళలు హారతి చేబూని భజన కళాకారులతో కలిసి సామూహికంగా పల్లకి సేవ నిర్వహించారు . కిరీట స్వీకరణలో కమిటీ సభ్యులు అబ్బగోని జగదీశ్వర్ గౌడ్, కూశన్నగారి నర్సయ్య, గడ్డం మల్లేష్, కొండ అశోక్ గౌడ్ ఉన్నారు. అన్నదాన సత్రంలో రాజారెవు బాల్రాజ్, ఇరుపాజి దామోదర్ గౌడ్, నోముల గంగారెడ్డి, వెంకటాపూర్ పద్మ మహేందర్, కోరెం నర్సాగౌడ్, దమ్మాయి లక్ష్మి, కండక్టర్ నర్సయ్య, సాయి సేవకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో పోలీసులపై ట్రిబ్యునల్ వేస్తం

ఆర్టీసీ కార్మికుల సమ్మెను అణిచివేసే కుట్ర జరుగుతుంది..

హేట్ స్పీచ్ బిల్లు రాజ్యాంగ విరుద్ధం, ఎమర్జెన్సీలో కూడా ఇలాంటి బిల్ రాలేదు..

వెబ్ డెస్క్, బతుకమ్మ :ముఖ్యమంత్రి, హోంమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల ప్రకారం పోలీసులు బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టి వేధించి, జైలుకు పంపాలని చూస్తే, రాబోయే బీఆర్ఎస్ పాలనలో పోలీసులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. దేవరకద్ర నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బసిరెడ్డి సంతోష్ రెడ్డిని అకారణంగా అరెస్ట్ చేసి, రాత్రికి రాత్రే జైలుకు పంపగా, ఈ రోజు మహబూబ్ నగర్ జైలులో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే, అల్ల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి తో కలిసి పరామర్శించారు. అనంతరం జరిగిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ ఇంటిగ్రెటెడ్ గురుకుల పాఠశాలను ఇథనాల్ ఫ్యాక్టరీకి దగ్గర లో పెట్టడాన్ని వ్యతిరేకించినందుకు, వాట్సాప్ లో మెసేజ్ ఫార్వర్డ్ చేస్తే అరెస్ట్ చేయడం దారుణమన్నారు. స్వయంగా ఎమ్మెల్యే ప్రాణాలకు ముప్పు ఉన్నదని కేసు పెట్టడం సిగ్గుచేటన్నారు. సంతోష్ రెడ్డి కేవలం సామాన్య కార్యకర్త అనీ, ఆయన నక్సలైట్ లేదా టెర్రరిస్ట్ కాదని, పోలీసులు ఎలా అక్రమ కేసులు పెడతారని నిలదీశారు. ఎమ్మెల్యే దగ్గర పోలీసులు తుపాకులతో పహారా ఉంటారని, ఆయన ప్రాణానికి ఎలా ముప్పు ఉంటుందని పోలీసులను ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెను అణచివేయాలని పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాండూరులో ఎస్హెచ్ఓ ఆర్టీసీ కార్మికులకు టెంట్ హౌస్, నీళ్లు, ఇతర సామాగ్రి ఇవ్వకూడదని ఆదేశాలివ్వడంపై మండిపడ్డారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ప్రకారం ఎవరైనా సమ్మె చేసుకునే హక్కు ఉందని స్పష్టం చేశారు. హోం మంత్రికి ఈ విషయం తెలియదా? డీజీపీ, హోం శాఖ సెక్రటరీ చెప్పలేదా అంటూ చురకలంటించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె వార్తలను రాస్తే జర్నలిస్టులపై కూడా కేసులు పెడతారా? అంటూ ధ్వజమెత్తారు. మహబూబ్ నగర్, ఇతర నియోజకవర్గాల్లో అక్రమంగా ఇసుక మాఫియా జరుగుతుందని ఆధారాలతో, వీడియోలతో సహా ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గతంలో మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా టీపీసీసీ నాయకులు జగ్గారెడ్డి పోలీసు అధికారులను ఎవరికి ఫుట్టినవురా అంటూ దుర్భాషలాడినా ఇప్పటికీ ఆయనను కనీసం ఎగ్జామిన్ చేయకపోవడం దారుణమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగలేదని, బాంబులతో పేల్చారని 2023 అక్టోబర్ లో కేసు నమోదైతే, పోలీసులు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మొన్న రేవంత్ రెడ్డి మేడిగడ్డ దగ్గరకు వెళ్లినప్పుడు హోం మంత్రిగా ఆ కేసు గురించి ఎందుకు రివ్యూ చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. దేశంలోనే అత్యధిక క్రిమినల్ కేసులున్న ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని, ఆయనే ఇపుడు హోం మంత్రిగా ఉన్నారని, పోలీసులు ఆయన ఆదేశాలు పాటిస్తే వారికి తర్వాత రోజుల్లో శిక్ష తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వతంగా అధికారంలో ఉండదని పోలీసులు గమనించాలని తెలిపారు. రాబోయే బీఆర్ఎస్ ప్రభుత్వం పోలీసుల అరాచకాలపై ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి తప్పకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇపుడున్న పోలీసులను బీఆర్ఎస్ పార్టీకి సహకరించాలని చెప్పడం లేదని, రాజ్యాంగ బద్ధంగా, చట్ట ప్రకారంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. అక్రమ కేసులు పెట్టడానికి, ప్రభుత్వాన్ని విమర్శించకుండా, వ్యతిరేకంగా మాట్లాడకుండా ప్రజలను నిరోధించడానికే ప్రభుత్వం హేట్ స్పీచ్ బిల్లు ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. దీనివల్ల జర్నలిస్టులు, కార్యకర్తలు ప్రజలందరికీ ఇబ్బంది కలుగుతుందన్నారు. వాట్సాప్ స్టేటస్ పెట్టినా, మెసేజ్ ఫార్వర్డ్ చేసినా, సోషల్ మీడియాలో ఏం రాసినా అరెస్టు చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని, ఆర్టికల్ 19 ని అపహాస్యం చేసినట్టేనని, ఎమర్జెన్సీ సమయంలో కూడా దేశంలో ఇలాంటి బిల్లు రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆర్టీసీ కార్మికుల న్యాయపోరాటానికి బీఆర్ఎస్ పార్టీ మద్దతు

సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్

బాన్సువాడ, బతుకమ్మ : బాన్సువాడ పట్టణంలో ఆర్టీసీ జేఏసీ పిలుపునిచ్చిన బంద్ కార్యక్రమానికి బాన్సువాడ బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులు పూర్తి మద్దతు ప్రకటించాయి.ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, బీఆర్ఎస్ నాయకులు క్షేత్రస్థాయిలో నిరసన గళం వినిపించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబెర్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలని, వారి న్యాయమైన డిమాండ్లను ఏమాత్రం జాప్యం చేయకుండా తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం బాన్సువాడ సబ్ కలెక్టర్‌ను కలిసి ఆర్టీసీ కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఆర్టీసీ డ్రైవర్లు, కార్మికులు చేపట్టిన సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ వెన్నంటే ఉంటుందని, వారికి వంద శాతం అండగా నిలుస్తామని నాయకులు స్పష్టం చేశారు. కార్మికులకు ధైర్యం చెబుతూ,తమ హక్కుల సాధనలో వెనకడుగు వేయవద్దని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.కార్మికుల పక్షాన పోరాటం రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా, కార్మికుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అంజి రెడ్డి, రత్న కుమార్, షేక్ అక్బర్, ఫిరోజ్ ఖాన్, శ్రీనివాస్, ఖలీల్, మక్బూల్, రామచంద్ర, సమీర్ ఇతర పార్టీ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బోధన్ రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేసిన హైదరాబాద్ డీఆర్ఎం

ప్రయాణికుల సౌకర్యాలు, భద్రతా అంశాలను సమీక్షించిన నిపుణుల బృందం

బోధన్, బతుకమ్మ :హైదరాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ (డీ.ఆర్.ఎం) సంతోష్ కుమార్ వర్మ బోధన్ రైల్వే స్టేషన్‌లో సమగ్రమైన ఉన్నత స్థాయి తనిఖీని నిర్వహించారు. సాంకేతిక నిపుణులు, వివిధ విభాగాల అధికారుల బృందంతో కలిసి వచ్చిన డి.ఆర్.ఎం, స్టేషన్ మౌలిక సదుపాయాలను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యాలు, గూడ్స్ యార్డ్ పనితీరు, భద్రతా అంశాలపై ప్రధానంగా దృష్టి సారించారు. స్టేషన్ కార్యాచరణ సంసిద్ధతను అంచనా వేయడం, గూడ్స్ యార్డ్ కోసం వ్యూహాత్మక పునర్నిర్మాణ ప్రణాళికను రూపొందించడం ఈ పర్యటన యొక్క ప్రధాన ఉద్దేశ్యమని వారు తెలిపారు. డివిజన్ సరఫరా గొలుసు సామర్థ్యాలను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చేదిద్దాలనే లక్ష్యంతో, సరుకు రవాణా సదుపాయాలను మెరుగుపరచడం కోసం అధికారులు ప్రస్తుతం ఉన్న ట్రాక్ లేఅవుట్‌లను, అందుబాటులో ఉన్న భూమిని పరిశీలించి బ్లూప్రింట్‌ను సిద్ధం చేశారు. ఈ చొరవ ద్వారా నిత్యావసర వస్తువుల రవాణాను క్రమబద్ధీకరించడం, ఈ ప్రాంతంలోని స్థానిక పరిశ్రమలు, వ్యవసాయ వాణిజ్యానికి బోధన్‌ను కీలకమైన లాజిస్టిక్స్ నోడ్‌గా మార్చడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ తనిఖీలో పి.టి.వి. దుర్గా ప్రసాద్, బీ. హేమ నాయక్, ఆర్. ప్రశాంత్ సాయి కృష్ణ, కె.విజయ్ కుమార్, శశాంక్ నామ్‌దేవ్, ఎమ్.లక్ష్మీనారాయణ, వి. విద్యాధర్, అనిరుధ్ పమార్, వై. సృజన్ కుమార్, తదితరులు ఉన్నారు.